క్లుప్తంగా

సింహాచలం దేవస్థానానికి వీల్ చైర్స్ బహూకరణ



వీల్ చైర్స్ అందిస్తున్న వైజాగ్ మెడికల్ సిండికేట్ సభ్యులు

సింహాచలం: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నడవలేని భక్తుల సౌకర్యార్థం వైజాగ్ మెడికల్ సిండికేట్ (హిందూస్థాన్ షిప్‌యార్డ్ కాలనీ) ప్రతినిధులు సింహాచలంలోని శ్రీ వరహాలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి రెండు వీల్ చైర్స్‌ను ఆదివారం బహూకరించారు. సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైజాగ్ మెడికల్ సిండికేట్ యాజమాన్యం, షిప్‌యార్డ్ డీజీఎం కాపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండమ్మతల్లి పండగ



అమ్మవారిని దర్శించుకొంటున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామ వాసుల ఆరాధ్య దేవత శ్రీబండమ్మతల్లి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.మహిళలు పసుపు కుంకుమలు,చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్,పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు,ఉప సర్పంచ్ సిరపరపు వాసు,గండి ముత్యాలనాయుడు,బత్తిన వెంకట్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో పాదపూజ



లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాస్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

సీతంపేట: శ్రీలలితా పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పాదచరణాలకు భక్తులు పాదపూజ నిర్వహించారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్‌లో ఆదివారం ఉదయం పండితుల వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో పాదపూజ చేశారు. అనంతరం స్వామీజీ భక్తులను ఆశీర్వదించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి దర్శనం కోసం విచ్చేశారు. పలువురు భక్తులు మంత్రోపదేశం తీసుకున్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విమల విద్యాలయం ఉపాధ్యాయుల దీక్షకు మద్దతు



ఉక్కునగరం: స్థానిక విమల విద్యాలయం ఉపాధ్యాయులకు పాఠశాల పూర్వ విద్యార్థులు మద్దతు తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ యాజమాన్యం, పాఠశాల యాజమాన్యం మధ్య జరిగిన ఒప్పందం కాల పరిమితి ముగియడంతో కొత్త ఒప్పందం చేయాల్సి ఉంది. అయితే ఇరువర్గాల మధ్య ఒప్పందం జరగకపోవడంతో ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవడం లేదు. అప్పటి నుంచి ఉపాధ్యాయులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల వద్ద ఉపాధ్యాయులను కలిసి తాము అండగా ఉంటామన్నారు. ఎన్నో వేల మందిని తీర్చిదిద్దిన పాఠశాల ఉపాధ్యాయులకు నష్టం జరిగితే సహించబోమన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లవిల్లి కనక భవాని, రామ్మోహన్‌కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మలుపుల మాటున ముప్పు!

హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు



ముత్యాలమ్మపాలెం రహదారిలో ప్రమాదకరంగా మలుపు



పరవాడ-తానాం రహదారిలో ఊర చెరువు వద్ద ప్రమాదకరంగా మలుపు

పరవాడ: మండలంలోని పలు రహదారుల్లోని మలుపులు ప్రజల పాలిట శాపంగా మారాయి. రహదారుల వెంబడి వీధి లైట్లు లేకపోవడంతో చీకటిపడితే రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మలుపుల వద్ద వాహనాలతో ప్రమాదాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారు. మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. పొద్దు పోయిన తర్వాత పనుల నుంచి వాహనాలపై ఇళ్లకు చేరే ఉద్యోగులు, కార్మికులు మలుపులను గుర్తించని కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు మృత్యువాత చెందారు. ఎంతో మంది క్షతగాత్రులవుతున్నారు. అయినా అధికారులు కనీసం మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.

ఇదీ పరిస్థితి

సబ్బవరం-లంకెలపాలెం రహదారిలో పెదముషిడివాడ వద్ద మలుపు అతి ప్రమాదకరమైంది. ఈ రహదారిలో హిందూజా, ఎస్ఈజెడ్, ఎన్టీపీసీ పరిశ్రమలకు బొగ్గు, బూడిద లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. అతివేగంగా వచ్చే బరువు కలిగిన వాహనాలు ఈ మలుపులో అనేక బోల్తా పడుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు కూడ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

- పరవాడ-తానాం రహదారిలో ఊర చెరువు వద్ద మలుపు వాహనచోదకుల పాలిట శాపంగా మారింది. మలుపులో ఎదురెదురుగా వస్తున్న వారు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- వాడచీపురుపల్లి-తిక్కవానిపాలెం రహదారిలో ఎస్సీ కాలనీ వద్ద మలుపు అతిప్రమాదకరంగా మారింది. ఈ మలుపులో నిత్యం ఏదో ఒకరు ప్రమాదానికి గురవుతున్నారు. ప్రతీ ఆదివారం తిక్కవానిపాలెం తీరానికి సందర్శన నిమిత్తం వచ్చే పర్యాటకులను ఇక్కడ మలుపు ప్రమాదాలకు గురిచేస్తోంది.
- వాడచీపురుపల్లి- ముత్యాలమ్మపాలెం రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ రహదారిలో సుమారు 13 ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. రహదారిలో నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, బస్సులు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. ముత్యాలమ్మపాలెం బీచ్‌కు రాకపోకలు సాగించే సందర్శకులు కూడా ఈ మలుపులు దాటుకొని రావాల్సిందే. రోడ్డు బాగుండడంతో వాహనచోదకులు రయ్ మంటూ అతివేగంగాప్రయాణిస్తున్న క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి.
- పరవాడ-గాజువాక రహదారిలో పోలీస్ స్టేషన్ వద్ద మలుపు కూడా ప్రయాణికులను నిత్యం భయపెడుతుంది. మండల కాంప్లెక్సు మలుపు, సబ్‌స్టేషన్ మలుపు, సినిమాహాలు జంక్షన్‌లో మలుపు, ఊటగెడ్డ కూడలి వద్ద మలుపులు అతి ప్రమాదకరంగా ఉన్నాయి.



వాడచీపురుపల్లి-తిక్కవానిపాలెంలో ప్రమాదకరమైన మలుపు



పెదముషిడివాడలో ప్రమాదకరమైన మలుపు

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ప్రజల తరపున పోరాడుదాం
- కార్యకర్తలే పార్టీకి వెన్నుముక
- వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందినంత మాత్రాన కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. అందరికీ నిరంతరం అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. రాంపురంలోని అదీప్‌రాజ్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉండగా ప్రతి ఇంటికీ మంచి జరిగిందని.. ఎందుకు ఓటమి చెందామో అన్నది మిస్టరీగా మారిందన్నారు. అయినా ప్రజా తీర్పును గౌరవిస్తున్నామన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అనేక హామీలను ప్రజలకు ఇచ్చి అధికారంలో వచ్చిందని..వాటిని తప్పకుండా అమలు చేస్తారని ఆశిస్తున్నామన్నారు. అలా కాకుండా ప్రజలను మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తే ప్రజల తరపున వారి గొంతుకై పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. పార్టీకి కార్యకర్తలు వెన్నుముక లాంటివారని..వారికి అండగా ఉంటామని చెప్పారు.

సమావేశంలో రాంపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, పార్టీ నేతలు బయిలపూడి భగవాన్ జయరాం, పైలా శ్రీనివాసరావు, పైలా సన్యాసిరాజు, చుక్క రామునాయుడు, గండి రవికుమార్, ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి, గొరపల్లి శ్రీను, బోకం రామునాయుడు, ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, దాడి ఉమమహేష్, గంధ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, వరంబాబు, కోన రామారావు, పాలిశెట్టి సురేష్, చందుయాదవ్, మోపాడ అప్పారావు, వద్దాది అప్పలరాజు, గనిశెట్టి కనకరాజు, కాపుశెట్టి శేషుబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం , కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



వెంకటాద్రి సన్నిధిలో ధ్యానం చేస్తున్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: నిత్యం ధ్యాన సాధన వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పిరమిడ్ ధ్యాన కేంద్ర ప్రతినిధులు శరగడం తులసి, దాడి కోటి మంగ అన్నారు. వెంకటాద్రి క్షేత్రం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ధ్యానంపై భక్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ రోజు నిర్దిష్ట సమయంలో ధ్యానం చేయాలని సూచించారు. అనేక అనారోగ్య సమస్యలకు కారణమైన మాంసాహారాన్ని త్యజించాలని కోరారు. ముందుగా వెంకన్నకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

పరవాడ: ప్రశ్న పత్రాల లీకులతో విద్యా వ్యవస్థకు ప్రమాదమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. నీట్, నెట్ అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రిగా కొనసాగే నైతిక అర్హత ధర్మేంద్ర ప్రధాన్ కోల్పోయారని.. ఆయన తక్షణమే రాజీనామా చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణలో ఘోర వైఫల్యానికి కారణమైన ఎన్‌టీఏను రద్దు చేయాలని కోరారు. నీట్‌లో అవకతవకలు, యూజీసీనెట్ 2024 రద్దు భావితరాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయన్నారు. లీకేజీ కుంభకోణాలను నిరసిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఎన్నో ఆశయాలతో ఏళ్ల తరబడి కష్టపడి చదివితే వారి భవిష్యత్ లీకులతో నాశనమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను సర్వనాశనం చేస్తున్న బీజేపీ విధానాలను మార్చుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యమా లేక మరే ఇతర కారణం ఉన్నా సమగ్ర విచారణ చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవాలి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేడ్కర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ అన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఎస్ఏడీలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. 'ప్రభుత్వ బడులు పరిరక్షించుకుందాం-పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' పేరిట ముద్రించిన కరపత్రాలను సంఘం నాయకులతో కలసి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు పైడిరాజు, ఉమాదేవి, రాంబాబు, సత్యం, రాము, రిజ్వాన్, రియాజ్ జిల్లాలోని 11 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మళ్లీ మొరాయించిన లిఫ్ట్



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పనిచేయని లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్ ఫామ్ వైపు ఉన్న లిఫ్ట్ మళ్లీ మొరాయించింది. మరమ్మతులు చేసిన పది రోజులకే పాడైపోయింది. మరో వైపు తరచూ లిఫ్ట్ మొరాయిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలోని లిఫ్ట్, కోచ్ ఇండికేటర్లు మొరాయిస్తున్నాయి. నిర్వహణా లోపం కారణంగా లిఫ్ట్ అలకపాన్పు వహిస్తుందని ప్రయాణికులు చెబుతున్నారు. లగేజీలు, పిల్లలతో మెట్లు ఎక్కలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి లిఫ్ట్ మొరాయించడంతో ప్రయాణికులు తిట్టుకుంటూ లగేజీలు మోసుకొని వెళ్తున్న పరిస్థితి కనిపించింది.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్

సబ్బవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని.. అవి తమ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గొటివాడలోని జనరేషన్ యువ ఆశ్రమ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా విద్యపై దృష్టి సారించాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను అందరికీ నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరకుండా నిరంతం పోలీసుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనరేషన్ యువ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల గానావధానం



లఘు నాటిక ప్రదర్శిస్తున్న గ్రూప్ సభ్యులు



ఘంటసాల గానావధానం నిర్వహిస్తున్న డాక్టర్ రహమతుల్లా

సీతంపేట: ఘంటశాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వైద్యుడు సయ్యద్ రహమతుల్లా నిర్వహణలో గాయనీగాయకులు పాత పాటలను మధురంగా పాడారు. టెలిగ్రామ్ గ్రూప్ సభ్యులు రెండు గ్రూపులుగా ఏర్పడి చెడుగుడు ఆట తరహాలో పాటలకు లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆనంద పరవశులను చేశారు. ఈ సందర్భంగా సోమయాజుల సత్యవాణి, హెచ్.సావిత్రి, సిహెచ్.నందగోపాల్ ప్రదర్శించిన ఘంటసాల లఘు నాటికలు ప్రేక్షకులను మైమరపింపజేశాయి. గానలహరిలో గాయనీ గాయకులు డాక్టర్ కె.రామ్మూర్తి, ఎం.ఎస్.వి.సుబ్బారావు, జి.నానాజీ, కె.రాజేంద్రప్రసాద్, బెహరా మురళి, బి.కల్యాణి, ఎన్.రేణుక ఆలపించిన ఘంటసాల పాటలు ఉర్రూతలూగించాయి. చివరగా డాక్టర్ రహమతుల్లా నిర్వహించిన ఘంటసాల గానావధానం ప్రక్రియ తీరు ఆకట్టుకుంది. వ్యాఖ్యాతగా మేడా మస్తాన్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.మహేష్, జి.వి.రావు, కె.రంగారావు పాల్గొన్నారు.

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9వ తరగతుల్లో ఎస్సీ కేటగిరీలో మిగిలిపోయిన సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విద్యార్థి ఆధార్, క్యాస్ట్ సర్టిఫికెట్‌తో వచ్చి స్థానిక గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సబ్బవరం గురుకుల పాఠశాలలో ఉదయం 10 నుండి 12 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు.మరిన్ని వివరాలకు 80084 69493 నంబర్‌లో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

రక్షక్ డ్రైవర్‌కు ద్వారకా పోలీసుల ఆర్థిక సాయం



సురేష్‌కు రూ.30 వేలు అందజేస్తున్న సీఐ రమేష్, ఎస్ఐలు, సిబ్బంది

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో కుమార్తెను కోల్పోయిన కమ్యూనిటీ హోం గార్డు డ్రైవర్ కుటుంబానికి ద్వారకా స్టేషన్ పోలీసులు బాసటగా నిలిచారు. ఈ స్టేషన్ రక్షక్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న బి.సురేష్ కంచరపాలెం జాషువానగర్‌లో భార్య, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి సురేష్ తన కుమార్తె పూజిత(9)తో కలిసి రైల్వే న్యూకాలనీ వెళ్లి తిరిగి వస్తుండగా తాటిచెట్లపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మరణించడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో సురేష్ కుటుంబానికి ద్వారకా జోన్ పోలీస్ అధికారులు, సిబ్బంది ఆర్థిక సాయం చేశారు. ఆదివారం స్టేషన్‌లో ద్వారకా సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐలు ధర్మేంద్ర, శ్రీను, సిబ్బంది రూ.30 వేలను సురేష్‌కు అందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ డి.వి.రత్నం, హెచ్‌సీలు శంకర్, కె.శ్రీను, సిహెచ్.శ్రీను, రామ్మూర్తిరాజు, పీసీలు ఎస్.రమేష్, కె.టి.వి.రమేష్, శ్రావణి పాల్గొన్నారు.

కేంద్రం ఆంక్షలతోనే స్టీల్‌ప్లాంట్‌కు నష్టం



దీక్షా శిబిరంలో మల్లయ్య, తౌడన్న, ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం పగబట్టిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు బి.మల్లయ్య, తౌడన్న ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 1228వ రోజు దీక్షా శిబిరంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గనులు లేకపోయినా సామర్థ్యానికి మించి ఉత్పత్తులు సాగించిన ఘన కీర్తి విశాఖ ఉక్కు సొంతమన్నారు. విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచేందుకు డీపీఆర్ సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రం తన అనుయాయులకు కర్మాగారాన్ని అప్పగించాలనే కుట్రతో విష ప్రచారం మొదలు పెట్టి ప్రైవేటీకరణకు తెరలేపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో విశాఖ ఉక్కును కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

'కోర్కెల దినం' విజయవంతం చేయండి



ప్రసంగిస్తున్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

ఉక్కునగరం: మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి పూనుకుంటోందని, అందుకు అడ్డుకట్ట వేసేందుకు జూలై 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కోర్కెల దినం విజయవంతం చేయాలని సీఐటీయు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అన్నారు. ఆదివారం ఉక్కునగరంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేసే ఉత్తర్వులను ఇవ్వడానికి సిద్ధపడుతుందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం వల్ల కార్మికవర్గం శ్రమదోపిడీకి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకాలను ఆపాలని, కనీస వేతనాలు నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఎస్.జ్యోతీశ్వరరావు, పి.మణి, బి.జగన్, పి.వెంకటరెడ్డి, శ్రీనివాస్, యు.రామస్వామి పాల్గొన్నారు.